

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



శనివారం 26-09-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :100 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్..

ఫార్మా దిగ్గజాలకు లోకేష్ ఆహ్వానం

ఏపీలో పెట్టుబడులకు అపార అవకాశాలు..
'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు ప్రాధాన్యం



అమరావతి, 25 సెప్టెంబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుజరాత్ పర్యటనలో భాగంగా అహ్మదాబాద్‌లో సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్--2026, ఏపీ ఈడీబీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫార్మా రంగ ప్రత్యేక రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

లా కాలేజీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి



హైదరాబాద్, 25 సెప్టెంబర్ (ఇది కద నిజం): ఉస్మానియా యూనివర్సిటీకి హామీ ఇచ్చిన రూ.వెయ్యి కోట్ల నిధులు ఏమయ్యాయని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఓయూ లా కాలేజీలో గురువారం రాత్రి నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న ఆమె విద్యార్థుల సమస్యలపై స్పందించారు. యూనివర్సిటీకి రూ.వెయ్యి కోట్లు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఓయూ వైపు కూడా చూడటం లేదని విమర్శించారు. లా కాలేజీ విద్యార్థులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, దాదాపు పది నెలలుగా మెస్ సౌకర్యం లేకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారని అన్నారు. తాగునీటి సమస్యతో పాటు విద్యార్థుల గదుల్లోకి పాములు వస్తున్నాయని, యూనివర్సిటీ డిస్పెన్సరీ కూడా మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకే పనిచేస్తోందని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ఐదారు నెలలుగా విద్యార్థులు రోడ్డుపై వంటలు చేసుకుంటూ ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని అన్నారు. మంత్రి సీతక్క కూడా ఓయూ విద్యార్థినేనని, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. లా కాలేజీ విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు తమ మద్దతు ఉంటుందని, అవసరమైతే వారితో కలిసి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని కవిత తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అమరావతిని రాజధానిగా ప్రకటిస్తూ పార్లమెంట్ చట్టం నేపథ్యంలో హైకోర్టు వ్యాఖ్యలు



అమరావతి, 25 సెప్టెంబర్ (ఇది కద నిజం): అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ప్రకటిస్తూ పార్లమెంట్ చట్టం తీసుకొచ్చిన నేపథ్యంలో మూడు రాజధానుల చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలు నిరర్థకమవుతాయని హైకోర్టు స్పష్టం చేసింది. అమరావతికి సంబంధించిన వివిధ పిటిషన్లపై శుక్రవారం హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. రాజధానిని అమరావతి నుంచి తరలించడం, మూడు రాజధానులుగా విభజించడం, మౌలిక వసతుల కల్పన, ప్లాట్లకు సంబంధించిన అంశాలపై గతంలో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి.

అక్టోబర్ 25 నుంచి 'హ్యామ్' రోడ్ల పనులు

ఉపాధి కూలీలకు రూ.8 వేల కోట్ల విలువైన పనులు.. ప్రతి గ్రామానికి రూ.50 లక్షలు



హనుమకొండ, 25 సెప్టెంబర్ (ఇది కద నిజం): హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులతో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలో, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి కల్పన, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీటి సరఫరా తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి పలు కీలక నిర్ణయాలను వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్తంగా రహదారుల అభివృద్ధి కోసం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) పద్ధతిలో చేపట్టనున్న రోడ్ల నిర్మాణ పనులను అక్టోబర్ 25 నుంచి ప్రారంభించాలని నిర్ణయించినట్లు సీతక్క తెలిపారు. ఇప్పటికే ములుగు జిల్లాలో ముఖ్యమంత్రి హ్యామ్ రోడ్ల పైలాన్‌ను ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎల్‌నినో ప్రభావం, వ్యవసాయ పరిస్థితులపైనా సమావేశంలో పూర్తిస్థాయిలో చర్చించినట్లు తెలిపారు.

ఎన్నికల సంఘంపై విశ్వాసం కాపాడాలి

కమిషనర్ల నియామకంలో సీజేఐ ఉండేలా చట్ట సవరణ చేయాలి: వైఎస్ జగన్



అమరావతి, 25 సెప్టెంబర్ (ఇది కద నిజం): దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలోపేతం కావాలంటే కేంద్ర ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై సంపూర్ణ నమ్మకం ఉండాలని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సంఘం నిర్ణయాలు, ఓటర్ల జాబితాల నిర్వహణకు సంబంధించి ఇటీవల వెలువడిన వార్తలు ప్రజల్లో అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొంటూ ఎక్స్ వేదికగా స్పందించారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పునఃపరిశీలించాలని జగన్ కోరారు. ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేతతో పాటు భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండే ముగ్గురు సభ్యుల కమిటీ ద్వారా ఎన్నికల కమిషనర్ల నియామకం జరిగేలా చట్ట సవరణ చేయాలని సూచించారు.

నషాముక్త్ తెలంగాణ..

డ్రగ్స్ కట్టడిలో దేశానికే ఆదర్శం
ఆరు కీలక అంశాల్లో జాతీయస్థాయిలో అగ్రస్థానం.. మిగిలిన వాటిలోనూ మెరుగైన ఫలితాలు సాధించాలి
: డీజీపీ సీవీ ఆనంద్



పాక్ జర్నలిస్ట్‌కు జైశంకర్ ఘాటు కౌంటర్!

న్యూస్ డెస్క్, 25 సెప్టెంబర్ (ఇది కద నిజం): భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో పెట్టుకుంటే ఎలా ఉంటుందో ఇప్పటికే వెస్ట్రన్ మీడియాకు చాలా బాగా తెలుసు. ఆయనను ప్రశ్నలు అడిగి తన్నించుకోవడం ఎందుకు అని ఒకటికి రెండుసార్లు ఆలోచించే పరిస్థితి వచ్చింది.



గోదావరిలో వరద పోతుంటే..
బురద రాజకీయాలేనా?

ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హరీశ్‌రావు లేఖ



హైదరాబాద్, 25 సెప్టెంబర్ (ఇది కద నిజం): గోదావరిలో భారీగా వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని అన్ని మోటార్లను వెంటనే నడిపించి, అందుబాటులో ఉన్న నీటిని జలాశయాల్లోకి ఎత్తిపోసి నిల్వ చేయాలని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్న సమయంలో గోదావరిలో భారీగా నీరు ప్రవహిస్తున్నా దాన్ని వినియోగించుకోకుండా దిగువకు వదిలేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాశారు.

గోదావరి జలాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవస్థను నిర్మించిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మొత్తం 141 టీఎంసీల సామర్థ్యంతో పలు రిజర్వాయర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గోదావరిలో వరదలు వచ్చిన సమయంలో నీటిని ఎత్తిపోసి ఆయా జలాశయాలను నింపితే రైతులకు భారీ ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం వరద ప్రవాహం ఉన్నప్పటికీ అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీలో ఉన్నాయని లేఖలో ప్రస్తావించారు.

50 టీఎంసీల సామర్థ్యం కలిగిన మల్లన్నసాగర్‌లో ప్రస్తుతం సుమారు 13 టీఎంసీల నీరు మాత్రమే ఉందని హరీశ్‌రావు తెలిపారు. మల్లన్నసాగర్‌ను నింపితే హైదరాబాద్ తాగునీటి అవసరాలతో పాటు ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మూసీ ప్రాజెక్టుకు కూడా నీటిని తరలించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కొండపోచమ్మసాగర్‌లో 15 టీఎంసీలకు గాను కేవలం 6 టీఎంసీల నీరు మాత్రమే ఉందని తెలిపారు. అక్కడికి నీటిని ఎత్తిపోస్తే యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లకు కూడా ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.

ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోతలు ప్రారంభిస్తే మిడ్‌మానేరు, అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లకు నీటిని తరలించవచ్చని హరీశ్‌రావు పేర్కొన్నారు. అదే సమయంలో హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఓట్ల తొలగింపుపై
బీజేపీ కుట్ర



హైదరాబాద్, 25 సెప్టెంబర్ (ఇది కద నిజం): అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తూ బీజేపీ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. పౌరులకు నోటీసులిచ్చి ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. నిజామాబాద్ లో గణేష్ నిమజ్జనయాత్రలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ డిమాండ్ చేసినట్లుగా.. ఎన్నికల సంఘం చీఫ్ తక్షణమే తప్పుకోవాలని, లేదంటే ప్రభుత్వం వారిని అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ గెలిస్తే ప్రజాస్వామ్యం..
ఓడితే విఘాతమా?

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి ఆగ్రహం



హైదరాబాద్, 25 సెప్టెంబర్ (ఇది కద నిజం): ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రిపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కోట్లాది మంది ప్రజల ఓట్లతో గెలిచిన వారిని 'దేశద్రోహి' అంటూ వ్యాఖ్యానించడం ఆయన అసహనాన్ని తెలియజేస్తోందని విమర్శించారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 26-09-2026

పాక్ జర్నలిస్ట్‌కు జైశంకర్ ఘాటు కౌంటర్!

న్యూస్ డెస్క్, 25 సెప్టెంబర్ (ఇది కద నిజం): భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో పెట్టుకుంటే ఎలా ఉంటుందో ఇప్పటికే వెస్టర్న్ మీడియాకు చాలా బాగా తెలుసు. ఆయనను ప్రశ్నలు అడిగి తన్నించుకోవడం ఎందుకు అని ఒకటికి రెండుసార్లు ఆలోచించే పరిస్థితి వచ్చింది. అలాంటిది పాకిస్తాన్‌కు చెందిన ఓ జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు జైశంకర్ ఘాటు కౌంటర్ ఇవ్వడం ఇప్పుడు వైరల్ అవుతోంది.

ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 81వ సమావేశం సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు ఒక కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో పాకస్తాన్ జర్నలిస్ట్ అకస్మాత్తుగా లేచి..“ భారత్ పాకిస్తాన్‌లో ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం ఎప్పుడు ఆపుతుంది? పాకిస్తాన్‌లో పరోక్ష ఉగ్రవాదానికి మీ ప్రభుత్వం మద్దతు ఇవ్వడం ఎప్పుడు ఆపుతుందో చెప్పగలరా?” అని ప్రశ్నించారు.

దీనికి జైశంకర్ తనదైన స్టైల్‌లో స్పందిస్తూ.. “ఒక ఉగ్రవాద దేశం నన్నే ఈ ప్రశ్న అడుగుతోంది” అని సమాధానం ఇచ్చారు. ఆ తర్వాత నవ్వుతూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. గతంలో చాలాసార్లు ఉక్రెయిన్ యుద్ధం, భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయడంపై వెస్టర్న్ మీడియా జర్నలిస్టులు జైశంకర్‌ను ప్రశ్నించిన క్రమంలో ఇలాంటి సమాధానాలతో జైశంకర్ వారి నోర్లు మూయించారు.

నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్.. ఫార్మా దిగ్గజాలకు లోకేష్ ఆహ్వానం

మొదటి పేజీ తరువాయి



ఫార్మా రంగానికి చెందిన పారిశ్రామికవేత్తలతో సమావేశమైన లోకేష్.. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి, రాష్ట్రానికి రావాలని ఆహ్వానించారు.

నక్కపల్లిలో అత్యాధునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్ ప్రత్యేకతలను పారిశ్రామిక వర్గాలకు మంత్రి వివరించారు. దేశంలో ఫార్మా రంగానికి కీలక కేంద్రంగా ఈ పార్కును అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. బల్క్ డ్రగ్ తయారీ, అనుబంధ పరిశ్రమలకు అనువైన వాతావరణాన్ని కల్పించేలా క్లస్టర్ విధానంలో పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫార్మా కంపెనీలు నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

పరిశ్రమల స్థాపనకు కేవలం ‘ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’కే పరిమితం కాకుండా.. అత్యంత వేగంగా అనుమతులు మంజూరు చేసే ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’ విధానాన్ని అమలు చేస్తున్నామని లోకేష్ తెలిపారు. పారిశ్రామికవేత్తలకు అవసరమైన అనుమతులను సింగిల్ విండో విధానంలో తక్కువ సమయంలోనే మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని భరోసా ఇచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులు రాష్ట్రంలో అందుబాటులో ఉన్నాయని వివరించారు.

ఫార్మా రంగానికి చెందిన పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు సమావేశానికి హాజరై ఏపీలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న పారిశ్రామిక వాతావరణం, మౌలిక సదుపాయాలు, అనుమతుల ప్రక్రియ, నైపుణ్యమున్న మానవ వనరులపై లోకేష్ వివరాలు వెల్లడించారు. ఏపీలో ఫార్మా రంగం విస్తరణకు ఉన్న అవకాశాలను పారిశ్రామికవేత్తలకు వివరించడంతో పాటు రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఈ సమావేశం ద్వారా భవిష్యత్‌లో మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశాలు పెరుగుతాయని పారిశ్రామిక వర్గాలు పేర్కొన్నాయి.

కాంగ్రెస్ గెలిస్తే ప్రజాస్వామ్యం.. ఓడితే విఘాతమా?



దానం నాగేందర్ వ్యవహారంలో న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతించాల్సింది పోయి అదే సమయంలో కాంగ్రెస్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు.

ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీలోకి మారిన దానం నాగేందర్‌కు కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో టికెట్ ఇచ్చిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. దీనినే అసలైన ‘ఓట్ చోరీ’గా ఆయన అభివర్ణించారు. ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించిన సందర్భాల్లో ఆ పార్టీ రాజ్యాంగబద్ధ సంస్థలపై అసహనం వ్యక్తం చేస్తోందని విమర్శించారు. దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో న్యాయస్థానం తీర్పు నేపథ్యంలో కిషన్‌రెడ్డి ఈ వ్యాఖ్యలు చేసినట్లు తాజా వార్తా నివేదికలు పేర్కొంటున్నాయి.

సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం, ఈవీఎంలపై కాంగ్రెస్ అనుమానాలు వ్యక్తం చేస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. ఎస్ఐఆర్ నిర్వహించిన ప్రాంతాల్లో బీజేపీ విజయం సాధించిందని ఆరోపిస్తున్న రాహుల్‌గాంధీ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. తమిళనాడు, కేరళలోనూ ఎస్ఐఆర్ నిర్వహించారని, అక్కడ బీజేపీ విజయం సాధించలేదని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ల పేర్లు తొలగించిన నియోజకవర్గాల్లోనూ టీఎంసీ విజయం సాధించిందని ఆయన పేర్కొంటూ, కాంగ్రెస్ వాదనలపై ప్రశ్నలు సంధించారు.

కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల ఫలితాలనూ ఇదే కోణంలో చూడాలా అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ గెలిస్తే ప్రజాస్వామ్యం గెలిచినట్లు, ఇతర పార్టీలు గెలిస్తే ప్రజాస్వామ్యానికి విఘాతం జరిగినట్లు చెప్పడం సరైనదేనా అని నిలదీశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్లు ఎం.ఎస్. గిల్, టీ.ఎన్. శేషన్‌లను ఎంపీలు, కేంద్రమంత్రులుగా చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

ఎన్నికల సంఘంపై విశ్వాసం కాపాడాలి

మొదటి పేజీ తరువాయి

తటస్థమైన నియామక వ్యవస్థ ఉంటే ఎన్నికల సంఘంపై ప్రజల్లో గౌరవం, విశ్వాసం మరింత బలోపేతమవుతుందని అభిప్రాయపడ్డారు. కాగా, ప్రస్తుత 2023 చట్టం ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ప్రధానమంత్రి నామినేట్ చేసే కేంద్ర మంత్రితో కూడిన ఎంపిక కమిటీ ఉంటుంది.

ఓటర్ల జాబితా సవరణలు, పేర్ల చేర్పులు, తొలగింపుల ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉండాలని జగన్ పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్లు వ్యక్తం చేసిన అభ్యంతరాలు ఏమిటి, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు, ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ ఏ విధంగా సాగిందనే అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత ఉండటమే కాకుండా.. అది ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించడంతో పాటు ఆ స్వతంత్రతపై ప్రజలకు నమ్మకం కలిగేలా చర్యలు ఉండాలని కోరారు. ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు బాధ్యత వహించే రాజ్యాంగబద్ధ సంస్థగా ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఎస్ఐఆర్ ప్రక్రియతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల డివిజన్ల పునర్విభజనలో అధికార దుర్వినియోగం జరిగిందని జగన్ ఆరోపించారు. ప్రతిపక్షంగా తమ పార్టీ చేసిన విజ్ఞప్తులు, అభ్యంతరాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకోలేదని విమర్శించారు. ఇటువంటి పరిణామాలు ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే అవకాశం ఉందని అన్నారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం కీలకమని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత సంబంధిత రాజ్యాంగ సంస్థలపై ఉందని వైఎస్ జగన్ పేర్కొన్నారు. కాగా, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టంపై దాఖలైన పిటిషన్ల విషయంలో సెప్టెంబర్ 23న సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి; తదుపరి నిర్ణయం కోసం అంశం ప్రధాన న్యాయమూర్తి ముందుకు వెళ్లింది.

అమరావతిని రాజధానిగా ప్రకటిస్తూ పార్లమెంట్ చట్టం నేపథ్యంలో హైకోర్టు వ్యాఖ్యలు



అమరావతి, 25 సెప్టెంబర్ (ఇది కద నిజం): అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ప్రకటిస్తూ పార్లమెంట్ చట్టం తీసుకొచ్చిన నేపథ్యంలో మూడు రాజధానుల చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలు నిరర్థకమవుతాయని హైకోర్టు స్పష్టం చేసింది. అమరావతికి సంబంధించిన వివిధ పిటిషన్లపై శుక్రవారం హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. రాజధానిని అమరావతి నుంచి తరలించడం, మూడు రాజధానులుగా విభజించడం, మౌలిక వసతుల కల్పన, ప్లాట్లకు సంబంధించిన అంశాలపై గతంలో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి.

ఈ పిటిషన్లపై గతంలో విచారణ జరిపిన హైకోర్టు.. అమరావతి నుంచి రాజధానిని తరలించేందుకు వీల్లేదని తీర్పు ఇచ్చిన విషయాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని కూడా అప్పట్లో స్పష్టం చేసినట్లు పేర్కొంది. ప్రస్తుతం అమరావతి ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి, మౌలిక వసతుల పనుల పురోగతిపై శుక్రవారం ధర్మాసనం వివరాలు తెలుసుకుంది.

రాజధానికి సంబంధించి గతంలో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీళ్లపై ఈ నెల 29న సుప్రీంకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉందని హైకోర్టు పేర్కొంది. సుప్రీంకోర్టులో ఈ అంశాలపై విచారణకు రానున్న నేపథ్యంలో సంబంధిత వ్యాజ్యాలపై తదుపరి విచారణను వాయిదా వేస్తున్నట్లు త్రిసభ్య ధర్మాసనం తెలిపింది.

మరోవైపు అమరావతి రాజధాని ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు వివిధ ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయని రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ) కోర్టుకు వివరించారు. రాజధాని ప్రాంత అభివృద్ధికి సంబంధించిన తాజా పరిస్థితులను ధర్మాసనం విచారణ సందర్భంగా పరిశీలించింది.

గోదావరిలో వరద పోతుంటే..

బురద రాజకీయాలేనా?

మొదటి పేజీ తరువాయి



ఈ రిజర్వాయర్లను నింపడం ద్వారా సుమారు 5 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణానికి ప్రయోజనం కలుగుతుందని లేఖలో వివరించారు. లోయర్ మానేరు డ్యామ్‌లో ప్రస్తుతం 11 టీఎంసీల నీరు మాత్రమే ఉందని, అక్కడికి నీటిని తరలిస్తే కరీంనగర్, వరంగల్ ప్రాంతాల్లో సాగు, తాగునీటి అవసరాలను తీర్చవచ్చని పేర్కొన్నారు.

పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, యాదాద్రి భువనగిరి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాల రైతులు, ప్రజలకు ఈ నీటి వినియోగం ద్వారా ప్రయోజనం కలుగుతుందని హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్వహణ కోసం రంగనాయకసాగర్ నుంచి నీటిని తరలించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం రంగనాయకసాగర్‌లో నీరు లేకపోవడంతో ఫ్యాక్టరీ నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్న సమయంలో గోదావరిలో అందుబాటులో ఉన్న నీటిని ఎత్తిపోసుకోకుండా కిందికి వదిలేయడం సరికాదని హరీశ్‌రావు విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఆన్-ఆఫ్ పద్ధతిలో కాకుండా 24 గంటలపాటు అన్ని మోటార్లను నడిపి గోదావరి వరద జలాలను జలాశయాల్లోకి ఎత్తిపోసి నిల్వ చేయాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినోను సాకుగా చూపకుండా అందుబాటులో ఉన్న గోదావరి నీటిని సద్వినియోగం చేసుకోవాలని, రాజకీయాలను పక్కనపెట్టి రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సూచించారు.

నషాముక్త్ తెలంగాణ.. డ్రగ్స్ కట్టడిలో దేశానికే ఆదర్శం

హైదరాబాద్, 25 సెప్టెంబర్ (ఇది కద నిజం): డ్రగ్స్ నియంత్రణ, అక్రమ రవాణా నెట్‌వర్క్‌ల ఛేదింపులో తెలంగాణ పోలీస్ శాఖ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. డ్రగ్స్ మహమ్మారిని మూలాలతో సహా నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ జాతీయస్థాయిలో అత్యుత్తమ పనితీరు కనబరుస్తోందని ప్రశంసించారు. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి యాంటీ నార్కోటిక్స్ అధిపతుల సమావేశంలో వెల్లడైన పనితీరు నివేదికల ప్రకారం.. కేంద్రం నిర్దేశించిన 10 కీలక మదింపు అంశాల్లో ఆరు అంశాల్లో తెలంగాణ పోలీసులు జాతీయస్థాయిలో అగ్రభాగాన నిలిచారని తెలిపారు.

శుక్రవారం హైదరాబాద్‌లోని డీజీపీ ప్రధాన కార్యాలయంలో ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఇతర ఉన్నతాధికారులు, సిబ్బందితో డీజీపీ ప్రత్యేక సమావేశం నిర్వహించి డ్రగ్స్ నియంత్రణ చర్యలను సమీక్షించారు. డ్రగ్స్ కేసుల్లో నిందితుల అరెస్టుల విషయంలో తెలంగాణ పోలీసులు మెరుగైన పనితీరు కనబరుస్తున్నారని అధికారులు వివరించారు. జాతీయస్థాయిలో ప్రతి డ్రగ్స్ కేసుకు సగటున 1.3 మంది నిందితులను అరెస్టు చేస్తుండగా.. తెలంగాణలో ఈ సంఖ్య 3.7గా ఉందని తెలిపారు. కేసుల్లో కేవలం పెడ్లర్లను మాత్రమే అరెస్టు చేయకుండా, వారి వెనుక ఉన్న సూత్రధారులు, సరఫరాదారులు, ఆర్థిక సహకారం అందించే వ్యక్తుల వరకు దర్యాప్తును విస్తరించి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

డ్రగ్స్ అక్రమ కార్యకలాపాల ద్వారా సంపాదించిన ఆస్తులను స్తంభింపజేయడం, జప్తు చేయడంలోనూ తెలంగాణ పోలీసులు ముందున్నారని డీజీపీ తెలిపారు. ఎన్‌డీపీఎస్ చట్టంలోని నిబంధనలను సమర్థవంతంగా అమలు చేస్తూ డ్రగ్స్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న స్థిర, చర ఆస్తులపై చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. డ్రగ్స్ బారిన పడే అవకాశం ఉన్న యువత, మైనర్లను గుర్తించి వారికి కౌన్సెలింగ్ తదితర సహాయక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అంతర్జాతీయ, అంతర్రాష్ట్ర డ్రగ్స్ నెట్‌వర్క్‌లపై దర్యాప్తులో భాగంగా ముంబై, గోవా, థాయ్‌లాండ్ వరకు వెళ్లి ఆధారాలు సేకరించి కేసులు నమోదు చేసినట్లు అధికారులు వివరించారు.

డార్క్‌వెబ్ ద్వారా జరుగుతున్న డ్రగ్స్ విక్రయాలపై కూడా ఈగల్ ఫోర్స్ ప్రత్యేక నిఘా పెట్టిందని డీజీపీ తెలిపారు. డార్క్‌వెబ్ లావాదేవీలను సాంకేతికంగా విశ్లేషించి అక్రమ నెట్‌వర్క్‌లను గుర్తిస్తున్నామని, ఇప్పటివరకు 500 కిలోలకు పైగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని 15కు పైగా కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. డ్రగ్స్ నియంత్రణలో సంస్థాగత వ్యవస్థ, కేసుల్లో అరెస్టుల రేటు, ఆస్తుల జప్తు, అంతర్జాతీయ స్థాయి దర్యాప్తు, డార్క్‌వెబ్ విశ్లేషణ, భారీ మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం వంటి ఆరు అంశాల్లో తెలంగాణ పోలీసులు జాతీయస్థాయిలో అగ్రస్థానంలో నిలవడంపై డీజీపీ సంతృప్తి వ్యక్తం చేశారు.

మిగిలిన నాలుగు మదింపు అంశాల్లోనూ మరింత మెరుగైన ఫలితాలు సాధించి రాష్ట్ర పనితీరును మరింత బలోపేతం చేయాలని అధికారులకు డీజీపీ దిశానిర్దేశం చేశారు. యువత భవిష్యత్తును కాపాడితేనే తెలంగాణ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం పోలీసు శాఖకు పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. ‘నషాముక్త్ తెలంగాణ-- నషాముక్త్ భారత్’ లక్ష్యంతో పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు సమష్టిగా పనిచేయాలని డీజీపీ సి.వి. ఆనంద్ పిలుపునిచ్చారు.

అక్టోబర్ 25 నుంచి ‘హ్యామ్’ రోడ్ల పనులు

మొదటి పేజీ తరువాయి




రైతులు ఏ పంటలు సాగు చేయాలనే అంశంపై ముందస్తుగానే అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.‘రాంజీ’ పథకం ద్వారా వ్యవసాయ కూలీలకు భారీగా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఈ పథకం కింద వ్యవసాయ కూలీలకు సుమారు రూ.8 వేల కోట్ల విలువైన పనులు కల్పించబోతున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ఇందుకోసం మొత్తం రూ.67 వేల కోట్ల వరకు నిధులు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. దూరప్రాంతాల్లో నివసించే గుత్తికోయ గూడాలకు సురక్షిత తాగునీరు అందించే అంశంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సీతక్క తెలిపారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రస్తుతం ప్రజలకు అవసరమైన మేరకు తాగునీటి నిల్వలు అందుబాటులో ఉన్నప్పటికీ, మారుమూల గుత్తికోయ గూడాలకు సురక్షితమైన తాగునీరు ఎలా అందించాలనే అంశంపై ప్రత్యేకంగా అధ్యయనం చేయనున్నట్లు చెప్పారు. అధికారి దానకిషోర్ ఇచ్చిన సూచనల మేరకు ఐఏఎస్ అధికారిణి దివ్యా దేవరాజన్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి నివేదిక రూపొందించనున్నట్లు వెల్లడించారు.

గ్రామీణాభివృద్ధిలో మహిళా సంఘాలకు మరింత ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 553 మండలాల్లో మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులను కేటాయించినట్లు పేర్కొన్నారు. ‘రాంజీ’ పథకం ద్వారా ప్రతి గ్రామానికి రూ.50 లక్షల చొప్పున నిధులు అందించబోతున్నామని, ఆ నిధులతో గ్రామంలో ఏ అభివృద్ధి పనులు చేపట్టాలనేది గ్రామ ప్రజలే నిర్ణయించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన పోస్టర్‌ను సర్పంచ్‌ల ద్వారా త్వరలో విడుదల చేయనున్నట్లు సీతక్క తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులను గుర్తించి వాటిని అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇదే తరహాలో మరో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని రేపు రంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు.

ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర: మహేష్ కుమార్ గౌడ్



ఈ దేశంలో పుట్టిన పౌరులను, పది సార్లు ఓట్లు వేసిన పౌరులను సైతం నోటీసులు ఇచ్చి ఇబ్బంది పెడుతున్నారని అన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కలిగి ఉండాలని చెప్పారు. అంతేకాకుండా నిజామాబాద్‌లో గణేష్ నిమజ్జనం అత్యంత పెద్ద పండుగ అని చెప్పారు. నిజమజ్జనంలో గణనాథుడిని సాగనంపుతూ రాష్ట్రం వ్యవసాయపరంగా, ఆరోగ్యపరంగా, విద్య పరంగా అన్ని రంగాలలో ముందుండాలని కోరుకున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేవిధంగా, వారు తిరిగి ఆశీర్వదించాలని కోరుకున్నామని చెప్పారు

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 26-09-2026

రాజేంద్రనగర్లో ప్రశాంతంగా గణపతి నిమజ్జనాలు

రాజేంద్రనగర్ పోలీసు అధికారులకు ఉత్సవ సమితి ఘన సత్కారం

ఇది కద నిజం, రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన స్వాగత వేదిక కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఏసిపి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ ఉత్సవ సమితి సెంట్రల్ కమిటీ మెంబర్ నారగూడెం మల్లారెడ్డి ఏసిపి శ్రీనివాస్ ని కండువాతో ఘనంగా సన్మానించారు. వీటితో పాటు శాంతిభద్రతలకు సహకరిస్తున్న ట్రాఫిక్ సి.ఐ. కిరణ్ తో పాటు ఇతర ఎస్.ఐ.లను కూడా కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏసిపి శ్రీనివాస్ మాట్లాడుతూ గత 11 రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న లంబోదరుడు వినాయక సాగరం వైపు పయనిస్తూ గంగమ్మ ఒడిలోకి నిమజ్జనమవుతున్న తరుణంలో మండపాల నిర్వాహకులు, కార్యకర్తలు ప్రశాంతంగా, సహనంతో నిమజ్జన కార్యక్రమాలను పూర్తి చేయాలని కోరారు. భక్తులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరస్పరం సహకరించుకోవాలని సూచిస్తూ గణేష్ ఉత్సవ సమితి సభ్యులందరికీ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రణవ భక్త సమాజం అధ్యక్షులు మోంద్ర నర్సింహా తో పాటు పదాధికారులు పుస్తకాల అశోక్, బర్ల మల్లారెడ్డి, సనివెల్లి కృష్ణ, కే. హరినాథ్, గండయ్య, ఎస్.బీ. హరినాథ్, మోంద్ర కొమురయ్య, కొలన్ సుభాష్ రెడ్డి, ప్రముఖ సామాజిక సేవకులు మ్యాడం మధుసూదన్ , జయానంద్ రెడ్డి, కిరణ్ చారి, కాకులారం కృష్ణ, సుధాకర్ రెడ్డి, వనం నర్సింహా, సోమారం రాజ్ కుమార్, వివేకానంద యూత్ అధ్యక్షులు సులిగే మహేందర్, సులిగే విజయ్ కుమార్, శివ కుమార్, నేతాజీ యూత్ అధ్యక్షులు సులిగే వెంకటేష్, సభ్యులు నల్లింగ్ రాజేందర్, శ్రీశైలం, జగన్, నల్లింగ్ విజయ్,



మహేందర్, సాబాధ విజయ్ కుమార్, గొరిగే రాజు, సోమనాథ్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, మణికంఠ, భజరంగ్ రెడ్డి, రవీందర్ రెడ్డిలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

అత్తాపూర్ గణేష్ లడ్డూ కోసం పోటాపోటీ

లడ్డూకు ఈ సారి రికార్డు ధర

ఇది కద నిజం, అత్తాపూర్: అత్తాపూర్‌లో గణేష్ లడ్డూ వేలం హోరాహోరీగా సాగింది. పురాతన పోచమ్మ ఆలయం వద్ద నవశక్తి భక్త సమాజ్ ఆధ్వర్యంలో 30వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో 11 రోజుల పాటు పూజలు అందుకున్న లడ్డూను వేలం వేశారు. లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకునేందుకు దాదాపు 50 మంది పోటీపడ్డారు. చివరి వరకు ఉత్కంఠగా సాగిన వేలంలో గుమ్మడి బ్రదర్స్‌కు చెందిన భూపాల్ రెడ్డి రూ.13 లక్షల 21 వేల రికార్డు ధరకు లడ్డూను దక్కించుకున్నారు. గతేడాది వేలం ధరతో పోలిస్తే ఈసారి రూ.70 వేల అధిక ధర పలికింది. దీంతో అత్తాపూర్‌లో ఇప్పటివరకు లడ్డూ ప్రసాదానికి పలికిన అత్యధిక ధరగా ఈ వేలం నిలిచింది. నవశక్తి భక్త సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాల్లో ప్రతిరోజూ భజనలు, కీర్తనలు, హారతులు, గణపతి హోమం, అన్నదానం, ముగ్గుల పోటీలు, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని కూడా నిర్వహించారు. చిన్నారులు, యువతకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. ఈ రోజు గణేష్ నిమజ్జనం ఘనంగా శోభాయాత్ర నిర్వహించినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు.



నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోలాహలంగా వినాయక శోభాయాత్ర

- రూ.2.65 లక్షలకు వినాయకుని లడ్డు కైవసం చేసుకున్న దర్శన్ రెడ్డి





ఇది కద నిజం, అత్తాపూర్ : హైదర్గూడాలో నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగిసాయి. చివరి రోజున అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజల సమక్షంలో శ్రీ గణేష్ వినాయక శోభాయాత్రను అత్యంత కోలాహలంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని గణపయ్యకు వీడ్కోలు పలికారు. శోభాయాత్ర ప్రారంభానికి ముందు స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతి నిర్వహించారు. అనంతరం నేతాజీ యూత్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డు వేలం పాటను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ వేలంలో స్థానిక భక్తులు, ప్రముఖులు పోటీపడగా, దర్శన్ రెడ్డి రెండు లక్షల 65 వేల రూపాయలకు లడ్డును పాడుకుని కైవసం చేసుకున్నారు. లడ్డు ప్రసాదాన్ని పొందిన దర్శన్ రెడ్డి ని అసోసియేషన్ సభ్యులు, స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.

ఆ తర్వాత డప్పు చప్పుళ్ళు, భక్తుల నృత్యాల నడుమ వినాయకుడి ఊరేగింపు వైభవంగా సాగింది. యువత, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని "గణపతి బప్పా మోరియా" శరణుఘోషలతో మార్గాన్ని ఆధ్యాత్మికమయం చేశారు.

షిండే ఆరోపణలు మానుకోవాలి

జుక్కల్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నల్లాల వినయ్ కుమార్



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జుక్కల్: తాజా మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదని, కేవలం అక్రమాలు, అన్యాయాలు, దోపిడీలకు పాల్పడి ఆస్తులు కూడబెట్టుకున్నారని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నల్లాల వినయ్ కుమార్ ఆరోపించారు. 15 సంవత్సరాల పాటు ఎమ్మెల్యేగా కొనసాగిన షిండే ఇసుక, భూ వ్యవహారాల్లో అవకతవకలకు పాల్పడ్డారని విమర్శించారు. హనుమంత్ షిండేకు తెలంగాణతో పాటు కర్ణాటకలోనూ ఆస్తులు ఉన్నాయని, ఇంత భారీగా ఆస్తులు ఎలా సంపాదించారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జుక్కల్ ఎమ్మెల్యేపై లేనిపోని ఆరోపణలు చేస్తూ తిరగడం సరికాదన్నారు. షిండే జుక్కల్ నియోజకవర్గానికి పట్టిన శనిగ్రహంలా మారారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇకనైనా ఆరోపణలు, విమర్శలు మానుకుని నోరు అదుపులో పెట్టుకోవాలని నల్లాల వినయ్ కుమార్ హెచ్చరించారు.

ఫార్మసిస్టులకు ఘన సన్మానం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: ప్రపంచ ఫార్మసిస్ట్ డే సందర్భంగా పిట్లం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పిట్లం ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఫార్మసిస్టులు శ్రీనివాస్, కల్పన, సవితలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని అన్నారు. వైద్యులు సూచించిన మందులను రోగులకు సక్రమంగా అందిస్తూ ఆరోగ్య సేవల్లో వారు ముఖ్యమైన బాధ్యతను నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జెడ్సీ నారాయణ, లయన్స్ క్లబ్ కార్యదర్శి మారుతిరెడ్డి, కోశాధికారి బాలు, డీసీలు నారాయణరెడ్డి, కిషన్, చంద్రశేఖర్, కాశిరెడ్డి, అశోక్ గౌడ్, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చింతకుంటలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం..

వైద్యాధికారి డాక్టర్ వికసిత ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ...



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 25: పరిశుభ్రత పాటించడం, సకాలంలో ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా నులి పురుగుల సమస్యను సమర్థవంతంగా అరికట్టవచ్చని స్థానిక వైద్యాధికారి డాక్టర్ వికసిత పేర్కొన్నారు. కడపజిల్లా.. దువ్వూరు ప్రాంతంలోని చింతకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బయన పల్లిలోని జ్ఞానజ్యోతి మార్థోమా ఉన్నత పాఠశాల తది,తర విద్యా సంస్థల్లో విద్యార్థులకు శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వికసిత మాట్లాడుతూ.. పిల్లల్లో నులి పురుగుల వ్యాప్తి వల్ల రక్తహీనత, తీవ్ర నీరసం, కడుపునొప్పి వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, ఇది పిల్లల చదువుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. విద్యార్థులు గోర్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా కత్తిరించుకోవాలని, భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా పాదరక్షలు ధరించాలని, మరుగుదొడ్లను మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని ఏడు సచివాలయాల పరిధిలో మొత్తం 3,960 మంది విద్యార్థులకు గాను ఇప్పటివరకు 3,885 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి, 97 శాతం కవరేజీ సాధించినట్లు తెలిపారు. మిగిలిపోయిన విద్యార్థులకు త్వరలోనే మాప్ అప్ కార్యక్రమం ద్వారా మాత్రలు అందించి 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామని వివరించారు.ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి రాజగోపాల్, ఆరోగ్య పర్యవేక్షకులు శివ గంగరాజు, మల్లేశ్వరి, సీహెచ్ఓ సౌభాగ్యలక్ష్మి, ఏఎన్ఎం ప్యారీ, ఆశా కార్యకర్త గంగాదేవి, పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రాజంపేట టీడీపీ కార్యాలయంలో "ప్రజా దర్బార్"..

బాధితుల సమస్యలపై చమర్తి జగన్ మోహన్ రాజు తక్షణ స్పందన..



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 25: రాజంపేట ప్రజల సమస్యల పరిష్కారమే పరమావధిగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాజంపేట తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు స్పష్టం చేశారు. స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకుని అర్జీలు అందజేశారు. ప్రజాదర్బార్ కు వచ్చిన ప్రతి ఒక్క అర్జీదారుడిని ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను చమర్తి ఓపిగ్గా విన్నారు. భూ సమస్యలు, పింఛన్లు, తాగునీరు, డ్రైనేజీ తదితర ప్రజా సమస్యలపై వచ్చిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం తక్షణ పరిష్కారం సాధ్యమయ్యే అంశాలపై అక్కడి, కక్కడే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. మిగిలిన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా చమర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ... ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకుని వారికి అండగా నిలవడానికే ప్రజాదర్బార్ ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి, ప్రతి పౌరుడి సంక్షేమానికి తాము నిరంతరం కట్టుబడి ఉన్నామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ మండలాల బాధ్యులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

వైద్య సేవలు చేయడమే కాదు ఆపద వస్తే నేనున్నా అంటూ ఆదుకొనే నేస్తం డాక్టర్. జమాల్ ఖాన్...

చింతూరు (ఇది కద నిజం)సెప్టెంబర్ 25:వరదల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధితుల కోసం ట్రస్ట్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేసి అందించారు. వరదల కారణంగా సాధారణ జీవనం స్తంభించి, ఆహారం కోసం ఇబ్బందులు పడుతున్న బాధితులకు భోజనం అందించడం ద్వారా ట్రస్ట్ సేవా కార్యక్రమాన్ని చేపట్టింది.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ జమాల్ ఖాన్ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు ఆహారం, అవసరమైన సహాయాన్ని అందిస్తూ అండగా నిలవడమే తమ లక్ష్యమన్నారు.వరద పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు.. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో బాధితులకు భోజన సదుపాయం కల్పిస్తామని జమాల్ ఖాన్ తెలిపారు. వరదలు కొనసాగినన్ని రోజులు ఈ భోజన సేవలను నిరంతరాయంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు.భోజన సాయం అందించిన జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్‌కు వరద బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ విద్యారణ్య పాఠశాలలో ఘనంగా 'నమామి భారతం'

150 ఏళ్ల 'వందేమాతరం' వేడుకలు

ఇది కద నిజం: ప్రాచీన సనాతన సంస్కృతి, దేశభక్తి భావనలను ప్రతిబింబిస్తూ శ్రీ విద్యారణ్య ఇంటర్ నేషనల్ పాఠశాల ప్రాంగణంలో 'నమామి భారతం' -- వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి విద్యాభారతి అఖిల భారతీయ ప్రచార ప్రభారీ లింగం సుధాకర్ రెడ్డి, విద్యాభారతి రాష్ట్ర సహ కార్యదర్శి NVK విశ్వేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమ విశ్వనాథన్, మేంగని వెంకటస్వామి, కోశాధికారి పసర్తి మల్లయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పంచాంగ పఠనం, దివ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వేడుకల్లో 10వ తరగతి విద్యార్థిని గేయ విశిష్టతను వివరించగా, 4, 5 తరగతుల విద్యార్థుల దేశభక్తి నృత్యాలు, 'వందేమాతరం' మానవహారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన 'సువిద్య' మ్యాగజైన్‌ను, వైయక్తిక గీతాన్ని అతిథులు ఆవిష్కరించారు.

విద్యాభారతి రాష్ట్ర సహ కార్యదర్శి చీఎఖ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ... విద్యాభారతి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉన్న 25,000 పాఠశాలల్లో ఉదయం 11 గంటలకు సుమారు కోటి మంది విద్యార్థులతో వందేమాతరం సామూహిక ఆలాపన జరిగిందని తెలిపారు. వందేమాతరం అంటే మాతృభూమికి చేసే పవిత్రమైన వందనమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం సరిగ్గా 11 గంటలకు పాఠశాల విద్యార్థులు, ఆచార్యులు, తల్లిదండ్రులు అందరూ ఏకమై వందేమాతరం గీతంలోని ఆరు పాదాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలపించారు.

విద్యాభారతి అఖిల భారతీయ ప్రచార ప్రభారీ లింగం సుధాకర్ రెడ్డి సభను ఉద్దేశించి మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా కోట్లాది గొంతులతో సామూహిక ఆలాపన జరపడం భావితరాలలో దేశభక్తిని రగిలిస్తుందని కొనియాడారు. అధర్వణ వేదంలోని 'మాతా భూమిః పుత్రోహం పృథివ్యాః' (భూమి నా తల్లి, నేను ఈ నేల బిడ్డను) అనే అమృత భావన నుంచే 'ఆనందమఠ్' నవలలోని ఈ వందేమాతరం గీతం ఆవిర్భవించిందని వివరించారు. 1905 నాటి బెంగాల్ విభజనను వ్యతిరేకిస్తూ దేశాన్ని ఏకం చేసిన మహా మంత్రంగా ఇది నిలిచిందని, దేశాన్ని గౌరవించడం అంటే కన్న తల్లిని గౌరవించడమేనని అన్నారు.



ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. విద్యార్థుల్లో జాతీయ భావాలను, పవిత్రమైన దేశభక్తిని పెంపొందించేలా ఇటువంటి స్ఫూర్తిదాయక కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ గీత ఆలాపన, వందేమాతరం నినాదాలతో ఉత్సవాలు అత్యంత ప్రశాంతంగా, వైభవంగా ముగిసాయి.

వందేమాతర గానంతో పులకించిన శ్రీ శారదాధామము.



ఇది కద నిజం: వందేమాతరం రచించి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా విద్యాభారతి దేశమంతా ఒకే సమయములో పూర్తి వందేమాతర గీతాలాపన కార్యక్రమము యోజన చేసింది .అందులో భాగంగా శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం ఆధ్వర్యంలో 1700 మందితో " సామూహిక వందేమాతర గీతాలాపన" అందరినీ ఉత్తేజితులను చేసింది . కార్యక్రమ ప్రస్తావనను శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్ ప్రస్తావన చేస్తూ....వందేమాతరం స్వతంత్ర ఉద్యమములో స్ఫూర్తి నింపిందని పేర్కొన్నారు . కార్యక్రమమునకు ప్రధాన వక్తగా విచ్చేసిన విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర ఉపాధ్యక్షులు -- రిటైర్డ్ IAS అధికారి ఎల్. వి.సుబ్రమణ్యం గారు మాట్లాడుతూ.....వందేమాతరం నినాదం అంగ్లేయుల గుండెల్లో రైళ్ళు పరుగెత్తించింది . దేశ స్వతంత్ర ఉద్యమానికి కొత్త ఊపిరి పోసిందని పేర్కొన్నారు . విద్యాభారతి దేశ వ్యాప్తంగా ఒకే సమయములో గీతాలాపన చేయడం చక్కటి రచన చేసిందని పేర్కొన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 26-09-2026

సినిమా న్యూస్



వయసుతో పనేముంది?

లేడీ సూపర్‌స్టార్ నయనతార, యువ హీరో కవిన్ జంటగా నటించిన రొమాంటిక్ డ్రామా 'హాయ్' ఓటీటీ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక జీ5లో నేటి నుంచి తమిళంలో ఎక్స్‌క్లూజివ్‌గా స్ట్రీమింగ్ కానుంది. నేటితరం ప్రేమ, ఆధునిక సంబంధాల్లోని భావోద్వేగాలను ఆసక్తికరంగా ఆవిష్కరించిన ఈ చిత్రానికి విష్ణు ఎడవన్ దర్శకత్వం వహించారు.

కుటుంబ సమస్యలతో సతమతమయ్యే యువతి.. అనుకోకుండా ఓ యువకుడిని కలవడం, ఆ పరిచయం వారి జీవితాల్లో ఎలాంటి మార్పులు తీసుకొచ్చిందనేదే ఈ సినిమా ప్రధాన కథాంశం. నయనతార ఇందులో ఆత్మవిశ్వాసంతో కనిపించే యువతి పాత్రలో నటించగా, కవిన్ భావోద్వేగాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే యువకుడిగా కనిపించారు. ప్రేమ, బంధాలు, కుటుంబ ఒత్తిళ్లను కథలో సహజంగా చూపించినట్లు నయనతార తెలిపారు.

రాధికా శరత్‌కుమార్, ప్రభు తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి మరో ప్రత్యేకత ఉంది. ఇటీవల కన్నుమూసిన దిగ్గజ దర్శకుడు, నటుడు, రచయిత కె. భాగ్యరాజ్ తెరపై కనిపించిన చివరి చిత్రాల్లో 'హాయ్' కూడా ఒకటి. దీంతో ఆయన అభిమానులకు ఈ సినిమా ప్రత్యేకంగా నిలవనుంది.

మమిత బైజు టార్గెట్ టాలీవుడ్

'ప్రేమలు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన మలయాళ నటి మమిత బైజు ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఈ అమ్మడి చేతిలో మూడు సినిమాలు ఉన్నప్పటికీ.. ఆమె టార్గెట్ మాత్రం టాలీవుడ్ అంటున్నారు. అయితే ఇప్పటివరకు ఒక్క తెలుగు సినిమాలోనూ మమితకు అవకాశం రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. 'ప్రేమలు'తో ఆమె నటనకు తెలుగు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడంతో పాటు, దర్శకధీరుడు రాజమౌళి సైతం ఆమె నటనను ప్రశంసించిన విషయం తెలిసిందే.

ఈ ఏడాది మమిత నటించిన పలు చిత్రాల్లో 'విశ్వనాథ్ అండ్ సన్స్', 'బెత్లహాం కుటుంబ యూనిట్' వంటి సినిమాలు విజయాన్ని అందుకున్నాయి. ముఖ్యంగా ఏజ్ గ్యాప్ లవ్‌స్టోరీలకు మమిత సెట్ అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 'విశ్వనాథ్ అండ్ సన్స్'లో సూర్య, మమిత మధ్య సుమారు 20 ఏళ్ల వయసు వ్యత్యాసం ఉండగా.. 'బెత్లహాం కుటుంబ యూనిట్'లోనూ హీరో, హీరోయిన్ పాత్రల మధ్య సుమారు 12 ఏళ్ల వయసు తేడా ఉన్న కథాంశం కనిపిస్తుంది. దీంతో ఇలాంటి కథలకు మమిత మంచి ఆప్షన్‌గా మారొచ్చనే చర్చ సాగుతోంది.

అయితే స్టార్ హీరోల సరసన మమిత ఎలా సెట్ అవుతుందనే సందేహంతోనే తెలుగు దర్శక నిర్మాతలు ఆమెకు అవకాశాలు ఇవ్వడంలో వెనుకడుగు వేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. మరోవైపు మలయాళం, తమిళంలో మమితకు వరుసగా అవకాశాలు వస్తున్నా.. టాలీవుడ్ నుంచి మాత్రం ఆఫర్ రాకపోవడం అభిమానులను కూడా ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తెలుగు సినిమాలో ఛాన్స్ వస్తే తన రెమ్యునరేషన్ విషయంలో రూ.2 కోట్లకు పైగా డిమాండ్ చేయాలనే ఆలోచనలో మమిత ఉన్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ముందుగా టాలీవుడ్ నుంచి ఆఫర్ రావడమే అసలు ప్రశ్నగా మారింది.





'రామాయణ' నుంచి తెలుగులో

'జై జై రామ్' రిలీజ్

బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు నితీష్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న భారీ పౌరాణిక చిత్రం 'రామాయణ'. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి స్పందన దక్కించుకోగా.. తాజాగా ఫస్ట్ సింగిల్ 'జై జై రామ్' ను తెలుగులో రిలీజ్ చేశారు మేకర్స్. దైవం, సంగీతం, సినిమాటిక్ గ్రాండియర్.. ఈ మూడు కలిసినప్పుడు ఆ అనుభూతి ఎలా ఉంటుందో చూపిస్తూ వచ్చిన ఈ తొలి సింగిల్ 'జై జై రామ్ ' ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతూ విశేష స్పందన దక్కించుకుంటుంది. కాగా.. నిర్మాత నమిత్ మల్హోత్రా ఈ విజువల్ వండర్‌ను అత్యున్నత సాంకేతిక విలువలతో నిర్మిస్తున్నారు. ఇందులో రాముడి పాత్రలో రణబీర్ కపూర్, సాయి పల్లవి సీతాదేవిగా, యష్ రావణాసురుడిగా, కాజల్ అగర్వాల్ మండోదరిగా, రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణక పాత్రలో కనిపించబోతున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ భారీ మైథలాజికల్ డ్రామా మొదటి భాగాన్ని ఈ ఏడాది దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఇక రెండో భాగాన్ని వచ్చే ఏడాది దీపావళికి థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఫుల్ జోష్‌లో చిరు 'కాకా'..



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కాకా'. సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాకు సంబంధించిన డబ్బింగ్ పనులు తాజాగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్రబృందం ఓ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇందులో చిరంజీవి 'కదిరి కాళిదాస్'గా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు.



'కామ్రేడ్ కళ్యాణ్' వాయిదా ?

అక్టోబర్ 2న రావాల్సిన 'ఆదర్శ కుటుంబం', వారం రోజులు ఆలస్యంగా తొమ్మిదిన థియేటర్లలోకి వస్తుంది. మరి, తొమ్మిదిన రావాల్సిన యంగ్ హీరో శ్రీవిష్ణు నటించిన 'కామ్రేడ్ కళ్యాణ్' వాయిదా పడుతుందా? 'ఆదర్శ కుటుంబం' రెండున రాకపోవడంతో చిన్న సినిమాలు ఊపిరి పీల్చుకున్నాయి. పాన్ ఇండియా మూవీ, స్టార్ హీరోల సినిమాలే కాదు, సీనియర్ హీరో వెంకటేష్ మూవీ 'ఆదర్శ కుటుంబాని'కి కూడా రిలీజ్ వాయిదా తప్పలేదు. గాంధీ జయంతికి వచ్చి దసరా హాలిడేస్ వరకు లాంగ్ రన్ ఉంటుంది అనుకుంటే, ఒక వారం ఆలస్యంగా తొమ్మిదిన రిలీజ్ అవుతుంది. అయితే, అదే రోజు రావాలని డేట్ ఫిక్స్ చేసుకున్న శ్రీవిష్ణు 'కామ్రేడ్ కళ్యాణ్' వాయిదా పడక తప్పదు. 'ఆదర్శ కుటుంబాని'కి ధీటుగా రిలీజ్ చేసే ఛాన్స్ శ్రీవిష్ణు తీసుకోవడం లేదు.

అందులోనూ సినిమా సెన్సార్ రివైజింగ్ కమిటీకి వెళ్ళడంతో, 'కామ్రేడ్ కళ్యాణ్' రిలీజ్‌పై ముందునుంచి డౌట్ ఉంది. ఒకవేళ సెన్సార్ ప్రాబ్లమ్స్ నుంచి బయటపడినా, 'ఆదర్శ కుటుంబాన్ని' డీకొట్టడం కష్టమే. పోనీ వారం తర్వాత వద్దామనుకుంటే.. అక్టోబర్ 15న 'జైలర్ 2', 16న 'రణబాలి' రిలీజ్ అవుతున్నాయి. ఈ లెక్కన 'కామ్రేడ్' మరో రిలీజ్ డేట్ చూసుకోవాల్సిందే. 'ఆదర్శ కుటుంబం' రిలీజ్ వాయిదా పడడం చిన్న సినిమాలకు కలిసి వచ్చింది. రాజమౌళి ప్రెజెంటర్‌గా నిర్మించిన 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' ఎలాంటి పోటీ లేకుండా థియేటర్స్‌లోకి రానుంది. ఫహద్ ఫాజిల్ నటించిన ఈ చిత్రం తెలుగు, మలయాళంలో రూపొందింది. విజయ్ కొడుకు జాసన్ డైరెక్షన్‌లో రూపొందిన సినిమా కూడా ఇదే రోజు రిలీజ్ అవుతుంది. అలాగే, చిన్న సినిమా 'తెల్ల కాగితం'కు కావలసినన్ని థియేటర్స్ దొరకనున్నాయి.